# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 158 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

24-04-2026 శుక్రవారం వెల : 1 /- పేజీలు : 4


# కమిషనర్ ఫోకస్.. ప్లాస్టిక్ ఖతమ్!




- ప్లాస్టిక్‌పై కమిషనర్ దృష్టి సారిస్తే శ్రీకాకుళానికి స్వర్ణయుగమే
- గతంలోనూ నిజాయితీ, నికార్సైన సేవలతో గుర్తింపు పొందిన అధికారి
- పాలిథిన్ కవర్లతో పర్యావరణానికి పెరుగుతున్న ముప్పు
- కఠిన చర్యలు తీసుకుంటే రాష్ట్రానికే ఆదర్శంగా శ్రీకాకుళం
- గుడ్డ సంచుల వినియోగంతో స్వచ్ఛ నగరానికి మార్గం
- అధికారుల కృషికి ప్రజల సహకారం తోడైతే విజయమే

శ్రీకాకుళం నగరాన్ని ఊపిరాడనీయకుండా చేస్తున్న ప్లాస్టిక్ ముప్పుపై కొత్త కమిషనర్ హనుమంతు కూర్మారావు దృష్టి సారిస్తే పట్టణ రూపురేఖలే మారిపోతాయనే ఆశాభావం ప్రజల్లో వ్యక్తమవుతోంది. నిజాయితీ, నికార్సైన పరిపాలన, కఠిన నిర్ణయాలకు పేరుగాంచిన ఆయన ముందడుగు వేస్తే పాలిథిన్ కవర్ల వినియోగానికి చెక్ పడటంతో పాటు పరిశుభ్ర శ్రీకాకుళం లక్ష్యం సాకారమవుతుందని నగరవాసులు భావిస్తున్నారు. కాలువలు మూసుకుపోవడం నుంచి పశువుల ప్రాణనష్టం, గాలి కాలుష్యం వరకు అనర్థాలకు కారణమవుతున్న ప్లాస్టిక్‌పై కమిషనర్ ఫోకస్ పెడితే నగరానికి నిజంగానే స్వర్ణయుగం మొదలవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**(నవతరం ప్రతినిధి శ్రీకాకుళం)**

శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హనుమంతు కూర్మారావు నిజాయితీ, క్రమశిక్షణ, పట్టుదల కలిగిన అధికారి అని ప్రజల్లో మంచి పేరు ఉంది. ఏ బాధ్యత చేపట్టినా నికార్సైన పని తీరుతో, ప్రజా ప్రయోజనాలను ముందుంచే ధోరణితో పనిచేసిన అధికారి అని పలువురు గుర్తుచేస్తున్నారు. గతంలో నిర్వహించిన పలు బాధ్యతల్లోనూ పారదర్శకత, సేవాభావం, కఠిన నిర్ణయాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన అధికారిగా పేరు సంపాదించారు. ఇలాంటి అధికారి శ్రీకాకుళానికి రావడం నగరాభివృద్ధికి శుభపరిణామమని స్థానికులు భావిస్తున్నారు. ముఖ్యంగా సమస్య ఏదైనా దానిపై దృష్టి సారిస్తే ఫలితం వచ్చే వరకు వెనక్కి తగ్గని తత్వం ఆయనదని చెప్పుకుంటున్నారు. అందుకే ప్రస్తుతం పట్టణానికి పెద్ద సమస్యగా మారిన ప్లాస్టిక్ వినియోగంపై కమిషనర్ దృష్టి పడితే మార్పు ఖాయం అని ప్రజలు విశ్వసిస్తున్నారు. ప్రస్తుతం ప్రతి రోజు మార్కెట్లు, దుకాణాలు, వీధి వ్యాపారాల ద్వారా వేల సంఖ్యలో పాలిథిన్ కవర్లు వినియోగంలోకి వస్తున్నాయి. వాడిన వెంటనే చెత్తగా మారుతున్న ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువలు మూసుకుపోవడానికి, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడానికి, దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ కవర్లు భూమిలో కరిగిపోకుండా ఎన్నో సంవత్సరాలు అలాగే ఉండి నేల సారాన్ని దెబ్బతీస్తున్నాయి. చెరువులు, నదులు, సముద్రాల్లోకి చేరే ప్లాస్టిక్ వ్యర్థాలు జలచరాలకు హాని కలిగిస్తున్నాయి. వీటిని తిని పశువులు ప్రాణాలు కోల్పోతుండగా, కాల్చినప్పుడు వెలువడే విషవాయువులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. శ్వాసకోశ సమస్యలు, చర్మవ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలకు ఇవి కారణమవుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో కమిషనర్ హనుమంతు కూర్మారావు ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారిస్తే శ్రీకాకుళం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. నిషేధిత పాలిథిన్ కవర్లపై తనిఖీలు, జరిమానాలు, వ్యాపారులతో సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు, గుడ్డ సంచుల పంపిణీ వంటి చర్యలు చేపడితే మంచి ఫలితాలు వస్తాయని సూచిస్తున్నారు.

ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు, కాగిత సంచుల వినియోగాన్ని ప్రోత్సహిస్తే పట్టణంలో పెద్ద మార్పు వస్తుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. మహిళా సంఘాల ద్వారా గుడ్డ సంచుల తయారీకి ప్రోత్సాహం కల్పిస్తే ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి.

నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన కమిషనర్ హనుమంతు కూర్మారావు ప్లాస్టిక్ సమస్యపై దృష్టి సారిస్తే, "ప్లాస్టిక్ రహిత శ్రీకాకుళం" లక్ష్యం త్వరలోనే సాధ్యమవుతుందని పట్టణవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సహకారం తోడైతే స్వచ్ఛ శ్రీకాకుళం కల సాకారం కానుందని చెబుతున్నారు.

# నిర్వాసితుల సమస్యలు ఎప్పుడు పరిష్కారం?

- విశాఖ ఉక్కు నిర్వాసితుల ఆవేదనకు స్పందన ఎక్కడ?
- నాలుగున్నర దశాబ్దాలుగా న్యాయం కోసం ఎదురుచూపులు
- స్టీల్ ప్లాంట్‌కు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- ఉక్కును సేల్‌లో విలీనం చేయాలని డిమాండ్
- నిర్వాసితులకు ఉపాధి, భూములు కల్పించాలి
- వరదరాజు ప్రభుత్వాలకు విజ్ఞప్తి



**నవతరం -విశాఖపట్నం**

విశాఖ ఉక్కు కర్మాగారం కోసం భూములు కోల్పోయి నిర్వాసితులైన వేలాది కుటుంబాల సమస్యలను ప్రభుత్వం ఎప్పుడు పరిష్కరిస్తుందని నవచైతన్య యువజన సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్ శిరిగిరి వరదరాజు ప్రశ్నించారు.

ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సుమారు నాలుగున్నర దశాబ్దాల క్రితం వేలాది కుటుంబాలు తమ ఆస్తులను త్యాగం చేసి విశాఖ ఉక్కు కర్మాగారం నిర్మాణానికి సహకరించాయని గుర్తుచేశారు. అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ఈ పరిశ్రమ ప్రస్తుతం ఉనికి కోసం పోరాడుతున్నా, నిర్వాసితుల సమస్యలు మాత్రం ఇంకా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం స్టీల్ -మిగతా 2లో

RASHTRIYA ISPAT NIGAM LIMITED

VIZAG STEEL

Pride of Steel

# భగీరథుని స్ఫూర్తితో జల సంరక్షణ చేద్దాం

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**(నవతరం- శ్రీకాకుళం)**

భగీరథ మహర్షి స్ఫూర్తితో జిల్లాలో జల సంరక్షణను చేద్దామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. భగీరథ మహర్షి జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివి నుంచి భువికి గంగను తీసుకొచ్చిన భగీరథ మహర్షి మహనీయుడని కొనియాడారు. గంగను భూమికి తీసుకురావడానికి ఆయన కఠోర తపస్సు చేశాడన్నారు.




ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరావు, బిసి సంక్షేమ శాఖ అధికారులు, బిసి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆంగ్ల భాష అంతర్జాతీయ సంబంధాల వారధి

## ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్యచంద్రరావు

**నవతరం -శ్రీకాకుళం**

ప్రస్తుత ప్రపంచంలో అంతర్జాతీయ సంబంధాలు, విద్య, వ్యాపారం, సాంకేతిక రంగాలలో ఆంగ్ల భాష కీలక పాత్ర పోషిస్తోందని, ప్రపంచ దేశాల మధ్య భావ వ్యక్తీకరణకు ఇది ఒక వంతెనలా పనిచేస్తుందని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్యచంద్రరావు పేర్కొన్నారు. గురువారం కళాశాలలోని ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆంగ్ల భాషా దినోత్సవ' వేడుకలకు ఆయన అధ్యక్షత




వహించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆంగ్ల విభాగాధిపతి కె. మౌనిక మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధ కవి, నాటక రచయిత విలియం షేక్స్పియర్ జన్మదినం వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా ఏప్రిల్ 23న -మిగతా 2లో

ఎడిటోరియల్

# యువతరం... నైతిక పతనం!

'కొంతమంది యువకులు రాబోవు యుగం దూతలు.. పావన నవజీవన బృందావన నిర్మాతలు.. బానిస బంధాలను తలవంచి అనుకరించరు.. పోనీ అని అన్యాయపు పోకడలు సహించరు.. వారికి నా ఆహ్వానం.. వారికి నా సెల్యూట్' అంటూ మహాకవి శ్రీశ్రీ యువతపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, కొంతమంది యువతను, విద్యార్థుల చేష్టలను చూస్తుంటే సమాజం ఎటుపోతుందో అనే ఆందోళన కలుగుతోంది. తోటి వారి పట్ల వ్యవహరిస్తున్న తీరు వెన్నులో వణుకు పుట్టిస్తోంది. రెండురోజుల కిందట హనుమకొండకు సమీపంలోని ఓ కార్పొరేట్ కాలేజీలో జరిగిన ఘటనే ఇందుకు కారణం. తోటి విద్యార్థిని పట్ల తన పైశాచికత్వాన్ని ప్రదర్శించాడు ఓ విద్యార్థి. ఆమె నగ వీడియోను కాలేజీ వాట్సాప్ గ్రూపులో షేర్ చేసి సమాజం తలదించుకునేలా చేశాడు. ఈ ఘటన పరిశీలిస్తే అనేక ప్రశ్నలు చుట్టుముడుతున్నాయి. ఆ వీడియో బయటకు వెళితే తాను పట్టుబడతానని ఆ విద్యా ర్థికి తెలియదా? లేదా అలాంటి వీడియోలు తీయకూడదని, షేర్ అసలే చేయకూడదనే కనీస ఇంగితం కూడా లేదా? తోటి విద్యార్థినిపై కక్ష తీర్చుకోవాలనే క్రూరమైనా ఆలోచన తప్ప తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో అసలు ఊహించి ఉంటాడా? ప్రస్తుతం వీడియో పోస్ట్ చేసిన విద్యార్థిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చట్టాలు, శిక్షలు ఎలా ఉన్నా.. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం కంటే ముందే ఇలాంటి దారుణాలు జరక్కుండా ఏం చేయాలనేది ఆలోచించాల్సిన అంశం.

అసలు యువత ఈ పెడధోరణులకు పాల్పడటానికి కారణలేంటి? ఇలాంటి దారుణమైన ఆలోచనలు ఎలా వస్తున్నాయి? దీనికి ఎవరు బాధ్యత వహించాలి? తల్లిదండ్రులా? అధ్యాపకులా? లేదంటే పాలకులా? కచ్చితంగా చెప్పాలంటే సమాజంలోని ప్రతి ఒక్కరూ వీటికి బాధ్యత వహించాల్సిందే. మరీ ముఖ్యంగా మన నాయకులు. వాస్తవంగా పరిశీలిస్తే నియంత్రణ లేని టెక్నాలజీ వాడకం దీనికి ఓ ప్రధాన కారణం. నేటి యువత సోషల్ మీడియాకు, టెక్నాలజీకి బానిసగా మారిపోతున్నది. పాతికేండ్లుదాటి న తర్వాత అనుభవించా ల్సినవి పదేండ్లలోపే చవిచూడాల నే ఆశ, ఆలోచన, కోరికలు పుట్టుకొస్తున్నా యి. చివరకు తోటి వాళ్లను బలిచేసైనా సరే తమ కోరిక తీర్చుకోవాలనే ఆవేశం, కసి, ఆక్రోశం పెరిగిపోతున్నది. చిన్నతనంలో తమ పనులకు అడ్డుతగల కూడదని పిల్లల చేతికి ఫోన్లు ఇచ్చి వాళ్లకు టెక్నాలజీని పరిచయం చేస్తున్నారు తల్లిదండ్రులు. తర్వాత అది లేకుండా ఉండలేని స్థితికి వచ్చేస్తున్నారు పిల్లలు. హైస్కూల్ స్థాయికే స్మార్ట్‌ఫోన్ కావాలంటూ పేచీలు పెడుతున్నారు. ఇవ్వకపోతే దారుణాలకు పాల్పడుతున్నారు. చివరకు ప్రాణాలు తీసుకుంటున్నారు లేదా తీస్తున్నారు. దాన్నే వ్యాపారంగా రూ.కోట్లు గడిస్తున్న కార్పొరేట్లు రకరకాల ఫీచర్లతో విచ్చలవిడి యాప్స్‌ను క్రియేట్ చేసి సమాజంపై వదులుతున్నారు. విద్యార్థులు, యువత వాటికి బానిసలైపోతున్నారు. నిజం చెప్పాలంటే నేడు స్మార్ట్‌ఫోన్ డ్రగ్స్ కంటే కూడా ప్రమాదకరమైన వ్యసనంగా మారిపోయిందని చెప్పొచ్చు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు నలభై శాతం విద్యాసంస్థలు, 79 దేశాలు పిల్లలు స్మార్ట్‌ఫోన్ వాడకాన్ని నిషేధించాయి. మనకంటే ఎక్కువ జనాభా ఉన్న చైనా తమ పిల్లలు స్మార్ట్‌ఫోన్లకు బానిసలు కాకుండా ప్రభుత్వమే రకరకాల కార్యకలాపాల్లో శిక్షణ ఇస్తుంది. అత్యంత చిన్న వయసు నుండే పుస్తకాలు చదివేలా, లైబ్రరీలకు వెళ్లేలా, వివిధ ఆటల్లో శిక్షణ తీసుకునేలా ప్రోత్సహిస్తుంది. ఫలితంగా యువతలో మానవ విలువలు కాపాడుకునే ప్రయత్నం చేస్తుంది చైనా. మరి మన దేశంలో ఆ కృషి చేయలేమా? పక్క రాష్ట్రమైన ఏపీ ప్రభుత్వం పన్నెండేండ్లలోపు పిల్లలకు స్మార్ట్‌ఫోన్ బ్యాన్ చేస్తూ జీవో విడుదల చేసింది. భవిష్యత్తులో పద్దెనిమిదేండ్ల పిల్లల వరకు పరిమితి విధించాలనే యోచన కూడా చేస్తోంది. అయితే ఇది ఆచరణలో ఎలా ఉంటుందో వేచి చూడాలి. మన రాష్ట్రంలో కూడా అలాంటి ప్రయత్నం అవసరం.యువత భవితను దృష్టిలో పెట్టుకొని సోషల్ మీడియా వేదికలు నిర్వహించే యాజమాన్యం కూడా యాప్స్ తయారీలో కొన్ని పరిమితులు పాటించాలి. కేంద్ర పాలకులు కేవలం తమ అధికారాన్ని కాపాడుకునేం దుకు యువతను వాడుకోకుండా దేశ భవితను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఇంకా ఆలస్యం చేస్తే యువత పూర్తిగా మన చేయి దాటిపోతుంది. శ్రీశ్రీ చెప్పినట్టు 'కొంతమంది కుర్ర వాళ్లు పుట్టుకతో వృద్ధులు.. పేర్లకి పకీర్లకి పుకార్లకి నిబద్ధులు' అన్న మాటలు నిజం చేద్దామా? లేదా 'కొంతమంది యువకులు రాబోవు యుగం దూతలు.. పావన నవజీవన బృందావన నిర్మాతలు'గా తీర్చిదిద్దుకుందామా అనేది ప్రభుత్వాలే కాదు, పౌర సమాజమూ ఆలోచించాలి. అందుకే భావి భారతాన్ని నిర్మించాల్సిన యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నది.

## పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్



నవతరం -ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సంద్ర అమరేంద్ర కుమార్ బుధవారం శివాని ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ పరీక్షలు రాస్తున్న పీయూసీ విద్యార్థుల సౌకర్యాలను, పరీక్షా నిర్వహణ తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.
ఈ పర్యవేక్షణలో రిజిస్ట్రార్‌తో పాటు ఆర్జీయూకేటీ పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, క్యాంపస్-2 ఇంచార్జి సాగర్, వెల్ఫేర్ డీన్లు సింహాచలం, యోగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలి

## సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో 'జూనియర్ రెడ్‌క్రాస్' విభాగం ప్రారంభం




నవతరం -శ్రీకాకుళం

విద్యార్థులు చదువుతో పాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకుని సమాజ సేవలో ముందుండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పి. జగన్మోహన్ రావు పిలుపునిచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో జూనియర్ రెడ్‌క్రాస్ విభాగాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రథమ చికిత్స, సిపిఆర్ విధానాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జగన్మోహన్ రావు మాట్లాడుతూ.. విపత్తులు లేదా ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించి ప్రాణాలు కాపాడేందుకు ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ విద్యార్థులకు క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చారు. గుండెపోటు వచ్చినప్పుడు చేసే సిపిఆర్, విద్యుత్ షాక్, పాము కాటు, యాంటీషాక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో బాధితులను ఎలా కాపాడాలో డెమో ద్వారా వివరించారు.
స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ రాజేశ్వరి, కరెస్పాండెంట్ సిస్టర్ జోసెఫ్ మేరీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించేందుకు జూనియర్ రెడ్‌క్రాస్ విభాగం ఎంతగానో దోహదపడుతుందన్నారు.
ఈ కార్యక్రమంలో జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్లు పి. రామకృష్ణ, ఎ. రమాదేవి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్వాసితుల సమస్యలు ఎప్పుడు పరిష్కారం?

మొదటిపేజీ తరువాయి

ప్లాంట్‌కు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదన్నారు. విశాఖకు వచ్చే ప్రముఖులు హామీలు ఇస్తున్నప్పటికీ అవి కేవలం మాటలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. విశాఖ ఉక్కును స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAIL) లో విలీనం చేసి పరిశ్రమను పూర్వ వైభవానికి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో నిర్వాసిత కుటుంబాలకు శాశ్వత ఉపాధి, జీవనోపాధి కల్పించడంతో పాటు మిగులు భూముల్లో ఒక్కో కుటుంబానికి ఐదు సెంట్ల స్థలం కేటాయించాలని కోరారు. ఉద్యోగాలు ఇవ్వలేని పరిస్థితిలోనైనా నిర్వాసితుల పునరావాసం, జీవనోపాధి కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని వరదరాజు సూచించారు. ప్రజల కోసం పని చేస్తామని చెప్పే ప్రభుత్వాలు ఇప్పుడు నిర్వాసితుల బాధలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కృతజ్ఞతా ఉషస్సు..!

వేకువ వెలుగులు విరిసిన వేళ,
పల్లవించిన ఆశే ఒక వరం...

కన్నులు విచ్చుకున్న క్షణం,
ప్రాణం పోసుకున్న అద్భుత కావ్యం

నిశీధిని చీల్చుకొచ్చే కిరణం,
పదునైన బాణంలా చీకటిని తుంచె...

స్నేహపు పలకరింపు,
ఎడారిలో కురిసిన
అమృత ధారలా మెరిసె...

శ్వాసను ప్రసాదించిన దైవానికి,
గుండె గూటిలో మౌన వందనం...

ప్రశాంత వాయువు,
తల్లి స్పర్శలా మేనుని
తడిమి మురిపించె...

ఆవిరి చిందే కాఫీ కప్పు,
వేడి సెగలతో నవ చైతన్యాన్ని నింపె...

ప్రతి అడుగు ఒక ప్రయాణమే...
ప్రతి నవ్వు ఒక సరికొత్త జీవనమే...
ప్రకృతి ఒడిలో ప్రతి నడక,
మనసు పొరల్లో నిండిన
ఒక ఆరోగ్యపు కానుకే...

పరమ పవిత్ర
ధన్యవాదాల ధూపం,
నలుదిక్కుల్లో వ్యాపించిన
ఆ దివ్యశక్తికి అర్పించిన
అందేది వరంగా
పొందేది దీర్ఘయుష్షువే.



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# ఆంగ్ల భాష అంతర్జాతీయ సంబంధాల వారధి

మొదటిపేజీ తరువాయి

ఈ దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. నేటి గ్లోబల్ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరూపించుకోవడానికి ఆంగ్ల భాష ఒక ముఖ్యమైన సాధనమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. చిన్నారావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ టి. ఆదిలక్ష్మి, ఆంగ్ల అధ్యాపకురాలు శ్రీమతి పి. కనకదుర్గ, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బీటీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే ఎంజీఆర్



నవతరం- పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మండలం పరిధిలో అక్కరపల్లి బీటీ రోడ్డు నుండి పూనిపేట (వయా కిట్టలాపాడు) గ్రామం వరకు రూ.200.00 లక్షల MGNREGS నిధులతో నిర్మించిన బీటీ రోడ్డును గౌరవ శాసనసభ్యులు శ్రీ మామిడి గోవిందరావు గారు ఘనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు.
ఈ రోడ్డు నిర్మాణం ద్వారా అక్కరపల్లి, కిట్టలాపాడు, పూనిపేట గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, రైతులకు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడం మరింత సౌకర్యవంతంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి MGNREGS వంటి పథకాల ద్వారా విస్తృతంగా నిధులు కేటాయిస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తోందని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. పాతపట్నం నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మండల ఎన్డీఏ కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు..

# ఖజురహో పార్శ్వనాథ ఆలయం - మధ్యప్రదేశ్





పార్శ్వనాథ మందిరం మధ్యప్రదేశ్ లోని ఖజురహో ఉన్న 10వ శతాబ్దపు దిగంబర జైన దేవాలయం. ఇది ఇప్పుడు పార్శ్వనాథునికి అంకితం చేయబడింది, అయితే దీనిని బహుశా చందేలా కాలంలో ఆదినాథ మందిరంగా నిర్మించారు. ఈ ఆలయానికి జైన అనుబంధం ఉన్నప్పటికీ, దాని వెలుపలి గోడలు వైష్ణవ ఇతివృత్తాలను కలిగి ఉన్నాయి. ప్రవేశ ద్వారానికి, అత్యంత పరిపూర్ణమైన మాయా చతురస్రంతో సహా ఒక శాసనం ఉంది. ఇది ఖజురాహో లోని ఇతర దేవాలయాలతో పాటు ప్రపంచ వారసత్వ ప్రదేశం భాగం, అత్యుత్తమ కళ, వాస్తుశిల్పం, చందేలా కాలం యొక్క సాక్ష్యం.

## మందిరం చరిత్ర

ఈ ఆలయాన్ని చందేలా రాజు ధంగా పాలనలో క్రీ. శ. 950, 970 మధ్య ఒక ప్రముఖ జైన కుటుంబం నిర్మించిందని, ఆలయ ఎడమ తలుపు స్తంభంపై క్రీ. శ. 954 (1011) నాటి శాసనం ఒక పాహిలా ద్వారా తోటల బహుమతులు, విరాళాలను నమోదు చేసింది. ఈ ఉద్యానవనాలకు పహిలా-వాటికా, చంద్ర-వాటికా", లఘుచంద్ర-వాటికా-, శంకర-వాటికా పంచైతల-వాటికా', అమ్రా-వాటికా, ధంగా-వాడీ అని పేరు పెట్టారు. ఈ శాసనం పహిలాను జననాథ భక్తుడిగా వర్ణిస్తుంది, ధంగా రాజు ఆయనను ఎంతో గౌరవించాడని పేర్కొంది.

ఆలయంలో ప్రతిష్ఠించబడిన మొట్టమొదటి విగ్రహం ఆదినాథ అని తెలుస్తోంది. 1852లో బ్రిటిష్ పురావస్తు సర్వేయర్ అలెగ్జాండర్ కన్నింగ్హామ్ సందర్శించినప్పుడు, ప్రధాన గర్భగుడి నిర్జనంగా ఉన్నట్లు కనుగొన్నాడు. ఆయన దీనిని "జననాథ ఆలయం" గా అభివర్ణించారు, దీనిని 1847లో ఒక జైన బ్యాంకర్ మరమ్మతు చేశారని రాశారు. 1860లో ప్రధాన గర్భగుడిలో పార్శ్వనాథ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆదినాథ విగ్రహాన్ని ఆలయ వెనుక భాగంలో ఉన్న ద్వితీయ మందిరంలో ఉంచారు.

## కళ, వాస్తుశిల్పం

ఖజురాహోలోని జైన దేవాలయాలలో పార్శ్వనాథ ఆలయం అతిపెద్దది. దీనికి ప్రవేశ ద్వారం, ఒక చిన్న హాలు, ఒక పెద్ద హాలు (మండపం), ఒక గర్భగుడి ఉన్నాయి. ఆలయ నిర్మాణం రెండు చివర్లలో దీర్ఘచతురస్రాకార నిర్మాణ చేశారని ప్రణాళికలో ఉంది. తూర్పు భాగం ప్రవేశ ద్వారాన్ని ఏర్పరుస్తుంది, పశ్చిమ భాగం అనేది గర్భగుడికి అనుసంధానించబడిన ఒక మందిరం.

ప్రవేశ ద్వారం పైకప్పు గొలుసు, పూల నమూనాలున్నాయి. ఒక జత ముడిపడి ఉన్న ఎగిరే విద్యాధరాలు ఉన్నాయి. మండపం యొక్క తలుపు-లింటల్లో ఆదినాథ సేవకుడి శిల్పం ఉంది: గరుడ స్వారీ చేస్తున్న పది ఆయుధాల చక్రేశ్వరి. గర్భగుడి జినాల శిల్పాలు ఉన్నాయి.

బయటి గోడలకు మూడు బృందాల శిల్పాలు ఉన్నాయి. ఈ శిల్పాలలో సురసుందరిలుమహిళలు-ఎగిరే జంటలు, నృత్యకారులు, సంగీతకారులు, ఖగోళ జీవులు ఉన్నాయి ఆలయానికి జైన అనుబంధం ఉన్నప్పటికీ, బయటి గోడలు హిందూ దేవతల శిల్పాలు, వారి భార్యలతో వారి అవతారాలతో సహా వైష్ణవ ఇతివృత్తాలను కూడా వర్ణిస్తాయి. వీటిలో విష్ణు - లక్ష్మి, రామ - సీత, బలరామ -పార్వతి, పరశురాముడు, హనుమంతుడు, బ్రహ్మ, కృష్ణుడి యమలార్జున పురాణాలు ఉన్నాయి. ఈ శిల్పాలు నమూనా, నిష్పత్తులు, సమతౌల్యంలో లక్ష్మణ ఆలయ శిల్పాలను పోలి ఉంటాయి. లక్ష్మణ ఆలయానికి భిన్నంగా, పార్శ్వనాథ ఆలయంలో స్పష్టమైన శృంగార శిల్పాలు లేవు, అయితే ఒక నిర్దిష్ట చిత్రం ఒక వస్తువుతో హస్త ప్రయోగం చేస్తున్న కాళ్ళతో ఉన్న అప్సర చూపిస్తుంది.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు



# కెరీర్ లో తొలిసారి సీనియర్ హీరో సరసన

సంక్రాంతి టార్గెట్‌గా సినిమా చేస్తున్న అనీల్ రావిపూడి.. చకచకా కాస్టింగ్ ప్రక్రియ పూర్తి చేస్తున్నాడు. ఇప్పటికే ఇద్దరు హీరోలను ఫిక్స్ చేసిన ఈ దర్శకుడు, తాజాగా కృతిశెట్టిని ఓ హీరోయిన్‌గా లాక్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో హీరోయిన్‌ను కూడా కన్‌ఫర్మ్ చేశాడు.

వెంకీ, కల్యాణ్‌రామ్ హీరోలుగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో రాబోతున్న సినిమా కోసం కీర్తిసురేష్‌ను హీరోయిన్‌గా తీసుకున్నారు. ఈ సినిమాలో కల్యాణ్ రామ్ సరసన హీరోయిన్‌గా కృతిశెట్టిని లాక్ చేసిన మేకర్స్, తాజాగా వెంకీ సరసన కీర్తిసురేష్‌ను తీసుకున్నారు. వెంకీ-కీర్తిసురేష్‌ది ఫ్రెష్ కాంబినేషన్.

నిజానికి ఈ ప్రాజెక్టు అనుకున్న వెంటనే వినిపించిన పేరు కీర్తిసురేష్. ముందుగా ఆమె పేరునే ప్రకటిస్తారని కూడా అనుకున్నారంతా. కానీ కాస్త ఆలస్యంగా ఆమె పేరును వెల్లడించారు.

కీర్తిసురేష్ తల్లి తమిళ-మలయాళ భాషల్లో హీరోయిన్‌గా ఓ వెలుగు వెలుగుతున్న రోజుల్లో, ఇటు తెలుగులో వెంకటేశ్ కూడా అగ్రహీరోగా కొనసాగారు. అలాంటి నటుడితో సరసన కీర్తిసురేష్ ఇప్పుడు హీరోయిన్‌గా నటించబోతోంది. ఇంత సీనియర్ హీరో సరసన ఫుల్ లెంగ్త్ హీరోయిన్‌గా నటించడం ఆమెకిదే తొలిసారి.

ఇలా హీరోయిన్లను ఒప్పించడం అనీల్ రావిపూడి స్పెషాలిటీ. నయనతారను ప్రచారానికి ఒప్పించిన ఈ దర్శకుడికి, కీర్తిసురేష్ ను వెంకీ సరసన హీరోయిన్‌గా నటించడానికి ఒప్పించడం పెద్ద సమస్య కాదు. జూన్ నుంచి ఈ సినిమా సెట్స్‌పైకి వస్తుంది. ఈ గ్యాప్‌లో విజయ్ దేవరకొండతో చేస్తున్న రౌడీ జనార్ధన సినిమాను పూర్తిచేస్తుంది కీర్తి.

# మరో రీ-ఎంట్రీ వృధా అయిందా?



ఎన్ని ప్రయత్నాలు చేసినా రాజశేఖర్ కు కాలం కలిసిరావడం లేదు. హీరో పాత్రలు తగ్గించి, క్యారెక్టర్ రోల్స్ వైపు షిఫ్ట్ అయిన రాజశేఖర్ కు సరైన సక్సెస్ దక్కడం లేదు. ఆశించిన స్థాయిలో గుర్తింపు రావడం లేదు.

2023లో వచ్చిన ఎక్స్ టార్డినరీ మేన్ సినిమాతో రాజశేఖర్ రీఎంట్రీ షురూ అయింది. నితిన్ హీరోగా నటించిన ఆ సినిమా డిజాస్టర్ కా బాప్ అనిపించుకుంది. ఆ ప్రభావం రాజశేఖర్ పై కూడా పడింది.

అలా రీఎంట్రీలో మెరవలేకపోయిన రాజశేఖర్, మరో మూడేళ్ల గ్యాప్ ఇచ్చి బైకర్ తో రీ-రీ-ఎంట్రీ ఇచ్చారు. కానీ దురదృష్టవశాత్తూ ఇది కూడా ఆయనకు కలిసిరాలేదు. ఆయన పోషించిన బుల్లెట్ సునీల్ పాత్ర సినిమాలో కొన్ని చోట్ల మెరిసినప్పటికీ.. ఓవరాల్ గా ఆయన కెరీర్ ను నిలబెట్టే పాత్ర కాదిది.

పైగా ఈ కాలం క్యారెక్టర్ హిట్టయితే సరిపోదు, సినిమా కూడా హిట్టవ్వాలి. అలాంటి బ్లాక్ బస్టర్ రాజశేఖర్ ఖాతాలో పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రీఎంట్రీ ఇచ్చిన నటీనటులంతా ఇలానే లబ్ధి పొందారు. రాజశేఖర్ కు మాత్రం ఆ సక్సెస్ ఇప్పటివరకు పడలేదు.

# "ఊరికే రాలేదు ఆ కుర్చీ"

## రేవంత్ రెడ్డి రాజకీయ ప్రయాణం- కొన్ని రియల్ స్టోరీస్




రేవంత్ రెడ్డి సీఎం కుర్చీకి చేరడం ఒక్కరోజులో జరగలేదు. మధ్యలో ఎన్నో టర్నింగ్ పాయింట్లు, రిస్కులు, ఎదుగుదల ఉన్నాయి. వాటిని సంఖ్యలతో క్లియర్‌గా చూస్తే ఇలా ఉంది:

1) గ్రామ స్థాయి నుంచి స్టేట్ లీడర్‌షిప్‌కి: చిన్న స్థాయి కార్యకర్తగా ప్రారంభమై, విద్యార్థి రాజకీయాలు మరియు స్థానిక స్థాయిలో పనిచేస్తూ బలమైన నెట్‌వర్క్‌ను నిర్మించుకున్నారు. గ్రౌండ్ కనెక్షన్ మరియు మాస్ కమ్యూనికేషన్ ఆయన ప్రధాన బలాలు అయ్యాయి.

2) కొడంగల్ విజయం – పేరు తెచ్చిన ఘట్టం: కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. బలమైన ప్రత్యర్థుల మధ్య నిలబడి గెలవడం ఆయనకు ఫైటర్ ఇమేజ్ ఇచ్చింది.

3) పార్టీ మార్పు- రిస్క్ తీసుకున్న నిర్ణయం: తెలుగు దేశం పార్టీ నుంచి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో చేరడం పెద్ద రిస్క్. కానీ అదే ఆయన కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ అయ్యింది. కొత్త పార్టీ లో తన స్థానం సంపాదించడం సులువు కాదు.

4) 2018 ఓటమి – వెనక్కి తగ్గని దృక్పథం: కొడంగల్‌లో ఓడిపోయినా వెనక్కి తగ్గలేదు. రాష్ట్ర స్థాయిలో యాక్టివ్‌గా ఉండి తన రాజకీయ ప్రెజెన్స్‌ను నిలబెట్టుకున్నారు.

5) 2019 లోక్‌సభ విజయం – కమ్‌బ్యాక్: మల్కాజిగిరి నుంచి ఎంపీగా భారీ మెజారిటీతో గెలిచి బలమైన కమ్‌బ్యాక్ ఇచ్చారు.

6) తెలంగాణ పీసీసీ చీఫ్‌గా ఎదుగుదల: కాంగ్రెస్‌లో అంతర్గత పోటీ మధ్య పీసీసీ చీఫ్‌గా ఎదిగి, పార్టీని మళ్లీ యాక్టివ్ చేయడానికి కృషి చేశారు. ఇది ఆయనకు రాష్ట్రవ్యాప్తంగా లీడర్‌షిప్ ప్లాట్‌ఫామ్ ఇచ్చింది.

7) 2023 ఎన్నికలు-సీఎం స్థాయికి చేరిక: పార్టీని విజయానికి నడిపించి ముఖ్యమంత్రి పదవిని సాధించారు. ఇది చాలా ఏళ్ల కృషికి ఫలితం.

8) వివాదాలు, విమర్శల- రాజకీయ వాస్తవం: కెరీర్‌లో విమర్శలు, కేసులు, ఆరోపణలు ఎదురైనా ముందుకు సాగడం ఆయన స్టైల్‌గా మారింది.

మొత్తం చూస్తే: రిస్క్ తీసుకోవడం, ఓటమి తర్వాత తిరిగి లేచే సామర్థ్యం, మరియు గ్రౌండ్ కనెక్షన్‌ను నిలబెట్టుకోవడం ఆయన ఎదుగుదలకు కీలకం. అందుకే "ఊరికే రాలేదు ఆ సీటు" అని చెప్పడం కొంతవరకు నిజమే. కానీ ఇప్పుడు ఆయనపై ఉన్న అమలు బాధ్యత కూడా అంతే పెద్దది.

సామాన్య వ్యక్తి
తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా

---

# చలివేంద్రాల ఏర్పాటుకు అందరూ ముందుకురావాలి

## – జెఎఫ్‌ఎ తమ్మినేని.ఉషారాణి, అడ్వైజర్ మణిశర్మ




**నవతరం-శ్రీకాకుళం**

చలివేంద్రాల ఏర్పాటుకు అందరూ ముందుకురావాలని, జిల్లా కలెక్టర్, మునిసిపల్ కమీషనర్ సూచనల మేరకు, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున, స్వచ్ఛంద సంస్థలు సంహరించి ప్రజల ధాత్రిని తీర్చాలని, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షురాలు జెఎఫ్‌ఎ తమ్మినేని.ఉషారాణి, అడ్వైజర్ మణిశర్మ అన్నారు. ఇందులో భాగముగానే నేడు స్థానిక చైతన్య జూనియర్ కళాశాల ఆవరణలో ఉచిత మజ్జిక పంపిణీ చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డా. జామి. భీమశంకర్ ఇచ్చిన సూచనలతో వేసవితాపం తగ్గేవరకూ చలివేంద్రం సేవలు కొనసాగిస్తామని, అన్ని పాఠశాలలు నేటితో ముగియనున్న సందర్భంగా విద్యార్థులు తాకిడి ఎక్కువగా ఉంటుందని, ఈ రోజు సుమారు 3 వేల మంది ప్రజలకు మజ్జిగను సిద్ధం చేశారన్నారు. అలాగే ఈ రోజు సహకరించిన జేసీఐ పూర్వపు అధ్యక్షులు ఐపిపి కూన అనిల్ కుమార్, అడ్వైజర్ మణిశర్మ, కార్యదర్శి జామి కృష్ణకాంత్, ఈవెంట్ మేనేజర్ సతీష్ లకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. సుమారు 3 వేలకు పైగా ప్రజల దాహార్తిని తీర్చుమని ఈ సందర్భంగా తెలిపారు.
ఈ కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ డైరెక్టర్ తేజస్వి సనపల, ఉపాధ్యక్షులు సురేంద్రనాథ్, సీనియర్ సభ్యులు మండవల్లి రవి, కోరాడ.రమేష్, కార్యదర్శి జామి.కృష్ణకాంత్, సాయి బాబా ఈవెంట్స్ మేనేజర్ సాయి బాబా, ఈవెంట్స్ మేనేజర్ సతీష్, నిత్య సహాయకులు గిరి, పి.హారతి తదితరులు పాల్గొన్నారు.

---

# బాలసదన్‌లో పిల్లల ఆరోగ్య స్క్రీనింగ్

- మిషన్ వాత్సల్యలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం
- శారీరక, మానసిక ఆరోగ్య పరీక్షలు నిర్వహణ
- అవసరమైన వారికి చికిత్సకు రిఫరల్
- పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన
- పిల్లల అభివృద్ధి స్థాయిపై సమీక్ష
- డీఈఐసీ బృందం సేవలు ప్రశంసనీయం




**నవతరం-శ్రీకాకుళం**

మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద జిల్లా సత్వర చర్యల చికిత్స కేంద్రం (DEIC) సిబ్బంది శ్రీకాకుళంలోని బాలసదన్‌ను సందర్శించి అక్కడ నివసిస్తున్న పిల్లల ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వైద్య బృందం పిల్లలకు శారీరక, మానసిక, వినికిడి, చూపు, పోషకాహార సంబంధిత అంశాలపై స్క్రీనింగ్ నిర్వహించింది. పిల్లల అభివృద్ధి స్థాయిని అంచనా వేసి అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు, చికిత్సలు, పునరావాస చర్యలు అందించేందుకు మార్గదర్శకాలు జారీ చేశారు.స్క్రీనింగ్ సమయంలో ప్రత్యేక సమస్యలు గుర్తించిన పిల్లలను జిల్లా ఆసుపత్రి మరియు సంబంధిత ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.అదనంగా పిల్లల సంరక్షకులకు ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రారంభ దశలోనే వ్యాధులను గుర్తించి తగిన చికిత్స అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఈఐసీ వైద్యులు, సిబ్బంది, బాలసదన్ నిర్వాహకులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

---

# ఉత్తరాంధ్ర కళలకు ప్రభుత్వ అండ కావాలి

- పలాసలో జరిగిన సదస్సులో కవులు, కళాకారుల పిలుపు
- జానపద కళలకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలన్న తీర్మానం
- శిక్షణా కేంద్రాలు, పురస్కారాల్లో ప్రాధాన్యం కోరిన వక్తలు
- మూడు కీలక తీర్మానాలకు ఏకగ్రీవ ఆమోదం





**నవతరం పలాస**

పలాస పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రంగం ప్రజా సాంస్కృతిక వేదిక శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల తప్పెటగుళ్ల శిక్షణ శిబిరంలో భాగంగా ఉత్తరాంధ్ర కళలు, సాహిత్య పరిరక్షణ సదస్సు జరిగింది. ఈ సదస్సులో కవులు, కళాకారులు, రచయితలు, ప్రజా గాయకులు పాల్గొని ఉత్తరాంధ్ర జానపద కళల పరిరక్షణకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు.
ప్రధాన వక్తగా పాల్గొన్న ఉత్తరాంధ్ర సాహిత్య పరిశోధకులు బద్రి కూర్మారావు మాట్లాడుతూ జానపదాలు అంతరించిపోతున్నాయని, వాటిని కాపాడేందుకు ప్రభుత్వ చర్యలు అవసరమన్నారు. పిల్లలకు పాఠ్యాంశంగా ఉత్తరాంధ్ర పాటలు పరిచయం కావడం శుభపరిణామమని, అయితే మరింత విస్తృతంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.
సీనియర్ కళాకారులు కుమార్ నాయక్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పాటలు, కళారూపాలు సినీ రంగంలో వినియోగించుకుంటున్నప్పటికీ కళాకారులకు తగిన గుర్తింపు రావడం లేదన్నారు.
ప్రజాగాయకుడు గంద్రెటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంత కళాకారులను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సాహకాలు అందించాలని కోరారు.
రంగం జిల్లా ఉపాధ్యక్షులు బెందాళం రాజేష్ మాట్లాడుతూ జానపద కళలను భావితరాలకు నేర్పించే శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ప్రతినిధి రాపాక ధనరాజు మాట్లాడుతూ తప్పెటగుళ్ల కళారూపానికి మరింత ప్రాచుర్యం కల్పించాలని అన్నారు.
యూటీఎఫ్ నాయకులు ఎల్.వి. చలం మాట్లాడుతూ జానపద కళలు మన భాషా సంస్కృతికి ప్రతీకలని, పాఠశాల విద్యార్థులకు వాటిని పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన రంగం జిల్లా అధ్యక్షులు కోర్రాయి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజా చైతన్యానికి ప్రజా కళలు ఎంతో దోహదపడ్డాయని, మారుతున్న కాలంలో వాటికి ఆదరణ తగ్గిందన్నారు. సదస్సులో మూడు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉత్తరాంధ్ర కళలు, సాహిత్యంపై అధ్యయనం చేసేందుకు 20 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, తప్పెటగుళ్లు, కోలాటం, చెక్కభజన వంటి కళారూపాలకు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఉగాది, హంస వంటి అధికారిక పురస్కారాల్లో ఉత్తరాంధ్ర కళాకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని తీర్మానించారు.
ఈ తీర్మానాల ప్రతులను ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు అందజేస్తామని రాష్ట్ర కార్యదర్శి కళారత్న రంగం రాజేష్ తెలిపారు. అనంతరం తప్పెటగుళ్ల గురువులు, ముఖ్య వక్తలను ఘనంగా సన్మానించారు.

---

# ఎస్ఎంఎల్‌టి సౌర కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఈశ్వరరావు

- పైడిభీమవరంలో ఘనంగా ప్రారంభమైన సౌర కార్యాలయం
- సౌర విద్యుత్ వినియోగం పెంచాలని ఎమ్మెల్యే పిలుపు
- ప్రధాని సూర్యఘర్ పథకంలో జిల్లా ఆరవ స్థానం
- విద్యుత్ బిల్లుల భారం తగ్గించేందుకు సౌర శక్తి మేలు





**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పైడిభీమవరం గ్రామంలో వెలిచేటి సాయివర్ధన్ ఏర్పాటు చేసిన ఎస్ఎంఎల్‌టి సౌర కార్యాలయాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వికసిత భారత్ సాధన 2047లో భాగంగా కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుత్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందన్నారు. శ్రీకాకుళం జిల్లా ప్రధాని సూర్యఘర్ పథకం అమల్లో రాష్ట్రంలో ఆరవ స్థానంలో ఉందని తెలిపారు.జిల్లా అంతటా సౌర పలకలు ఏర్పాటు చేయడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో ఉచిత విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నందున ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వారీ ఎనర్జీస్ లిమిటెడ్ ఉప మేనేజర్ గోకిన సురేష్, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**